క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరికలు

దేవరపల్లి: దుద్దుకూరు గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. శుక్రవారం రాత్రి గ్రామంలో జరిగిన పార్టీ కార్యకర్తలు, నాయకుల పరిచయ కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వారిలో పాపోలు భాస్కరరావు, కళ్లేపల్లి రాజు, బొల్లిపో ప్రదీప్, సీహెచ్ జాకబ్ స్టీఫెన్, కొండ షాన్‌వాష్ మయూర్, కొండ సాయిరామ్, పెదమూర్తి అచ్చిబాబు, మల్లిపూడి బాలకృష్ణ ఉన్నారు.

పెద్దేవంలో గడప గడపకూ మన ప్రభుత్వం

తాళ్లపూడి: పెద్దేవంలో శనివారం మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొవ్వూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించి, సమస్యలను తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శెట్టిపేటలో రెండో రోజు..

నిడదవోలు రూరల్: మండలంలోని శెట్టిపేట గ్రామ సర్పంచ్ జడ్డు శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తలారి పరామర్శ

తాళ్లపూడి: పెద్దేవం గ్రామానికి చెందిన పలువురు కుటుంబాలను కొవ్వూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావు శనివారం పరామర్శించారు. పెద్దేవం గ్రామానికి చెందిన బట్టు నాగేంద్ర భార్య స్వీటీ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిడిపి శివారు పెద్దేవం వార్డుకు చెందిన యువకుడు కొడమంచిలి నవీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను స్థానిక నాయకులతో కలిసి తలారి వెంకటరావు పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ, కాపు జేఏసీ నాయకులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు: కుమారదేవం గ్రామం వద్ద గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. మృతుడికి సుమారు 30ఏళ్లు ఉండవచ్చని, 5.2 అడుగుల పొడవు ఉంటాడని, మృతుడి వద్ద ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదని రూరల్ ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. వివరాల కోసం రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. 94407 96623 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజల కోసమే వలంటీర్ వ్యవస్థ

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- పట్టణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం



సత్కారం పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, పార్లమెంటరీ ఇన్‌చార్జి శ్రీనివాస్

నిడదవోలు: రాజకీయ చరిత్రలో ఏ నాయకుడు ఆలోచించని విధంగా ప్రజల సంక్షేమాన్ని కోరుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వలంటీర్ వ్యవస్థను రూపకల్పన చేశారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన వలంటీర్ల వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా దివంగత మహనేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సంక్షేమం కొనసాగాలంటే ఈ ప్రభుత్వమే రావాలని, అందుకోసం ప్రభుత్వం చేసినన మంచిని వలంటీర్ల ప్రతి గడపకు తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భూపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యలగాడ బాలరాజు, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, పువ్వల రతీదేవి, ఎండీ షకీరాబేగం, దాకే అనిల్‌కుఆమర్, ఉసురుమర్తి జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యం

హోం మంత్రి తానేటి వనిత,
రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి శ్రీనివాస్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి వనిత, చిత్రంలో గూడూరి శ్రీనివాస్

దేవరపల్లి: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత, రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెం, త్యాజంపూడి గ్రామాల్లో శనివారం రాత్రి జరిగిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశాల్లో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని ఆమె కోరారు. త్యాజంపూడి గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు మంత్రి వనిత, గూడూరి శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి వనితను సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, వెంకటసతీష్ దంపతులు గజామలతో సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, యర్నగూడెం, త్యాజంపూడి సర్పంచ్‌లు బొంతా భరత్‌బాబు, కుసులూరి వెంకటసతీష్, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు మేడిబోయిన గంగరాజు, మండల రైతు విభాగం కన్వీనర్ పల్లి రత్నారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు పోతుల కృష్ణారెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ద్వారకా తిరుమల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు మంత్రి, గోపాలపురం నియోజక వర్గం ఇన్‌చార్జి తానేటి వనితను కలిసి సంఘీభావం తెలిపారు. శుక్రవారం రాత్రి దేవరపల్లి మండలం యర్నగూడెంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద యాదవ సంఘ సభ్యులు మంత్రి వనితను కలిసి ఘనంగా సన్మానించారు. మీ వెంట తామంతా ఐక్యంగా నడుస్తామని, మీ గెలుపునకు కృషి చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. పార్టీ యువనాయకుడు, ఎంపీపీ మోహినీ భర్త బొండాడ వెంకన్నబాబు, శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు మానికల వెంకటేశ్వరరావు, బుసనబోయిన వంశీ, కంచెం రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు, కంపచాటి రామకృష్ణ, పాకనాటి శ్రీమన్నారాయణ, కరేటి వెంకన్న, నాగరాజు, పానకాలు, దుర్గారావు,మంగారాజు, రుక్మిణీనాథ్, దుర్గేష్ పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యాల్లేకుండా చర్యలు



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: ఈ నెల ఎనిమిదో తేదీన మహాశివరాత్రి సందర్భంగా గోష్పాద క్షేత్రానికి తరలివచ్చే భక్తులకు ఏవిధమైన ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. శనివారం క్షేత్రాన్ని సందర్శించి, అధికారులకు వివిధ సూచనలిచ్చారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని స్నాన ఘట్టాల్లో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా రక్షణ వలయంగా పడవలను, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయించాలని, విద్యుద్దీపాలు, తాగునీరు , పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బందోబస్తు, వైద్య శిబిరాలు, ఎక్కడికక్కడ డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ కె.మస్తాన్, మున్సిపల్ మేనేజర్ రాధాకృష్ణ, ఏఈ దుర్గా కిషోర్, డిప్యూటీ తహసీల్దార్ అజయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- తప్పనిసరిగా పల్స్ పోలియో వేయించండి
- నేడు పోలియో చుక్కల కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తి

దేవరపల్లి: పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఆదివారం పల్స్‌పోలియో దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పోలియో చుక్కల శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు. దేవరపల్లి మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 8045 మంది పిల్లలు ఉండగా, 68 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాల వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు తెలిపారు.దేవరపల్లి పీహెచ్‌సీ వద్ద ఉదయం 9.30 గంటలకు మంత్రి తానేటి వనిత పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని డాక్టర్ సాంబశివరావు తెలిపారు.

కొవ్వూరు: దొమ్మేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 4,485 మంది చిన్నారులున్నారన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు అన్ని సిద్ధం చేసినట్టు తెలిపారు. పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమానికి 33 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి టి.సుష్మ తెలిపారు.

ఉండ్రాజవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిని గ్రామాల్లో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ శనివారం తెలిపారు. మండలంలో 36 బూత్‌ల్లో 5,059 మంది పిల్లల లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఎవరైనా బూత్‌లకు రాని పక్షంలో మరుసటి రోజు ఇంటి ఇంటికీ సర్వే చేసి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలో పది గ్రామ సచివాలయాల పరిధి 31 బూత్‌ల్లో 4151మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్టు పీహెచ్‌సీ డాక్టరు గంగాధరరావు చెప్పారు.

పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి

నిడదవోలు రూరల్: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివాజీ సూచించారు. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని సమిశ్రగూడెంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు ఎ.రాజమోహన్, వైపీ రమణ, లక్ష్మిబాయ్, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు: పట్టణానికి చెందిన మహిళ పసుపులేటి సీతామహాలక్ష్మి తనను అదనపు కట్నం కోసం శారీరకంగాను, మానసికంగా భర్త సతీష్, అత్త నాగమణి, ఆడపడుచులు వేధిస్తున్నట్టు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు తెలిపారు.

కంఠమణి కుటుంబానికి మంత్రి పరామర్శ

నల్లజర్ల: అనంతపల్లిలో అస్వస్థతకు గురై మృతి చెందిన నల్లజర్ల సహకార కళాశాల చైర్మన్ కంఠమణి నారాయణ ప్రసాద్ కుటుంబ సభ్యులను హోం మంత్రి తానేటి వనిత శనివారం సాయంత్రం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు దూబచర్ల గాంధీకాలనీలో గుండెపోటుతో మృతి చెందిన బోడిగడ్ల సుజాత కుటుంబ సభ్యులను, అదే కాలనీలో తాడిగడప అమావసయ్య, తాడిగడప మాణిక్యం కుంటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. అనంతరం దూబచర్లలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పందిసత్యనారాయణ ఏర్పాటు చేసిన శ్రీరామాంజనేయ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తొమ్మండ్రు రవి ఇంటి వద్ద పార్టీనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమాలలో మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, బంక అప్పారావు, కరుటూరి లక్ష్మీగణేశ్వరావు, ఎంపీటీసీ వామిశెట్టి పావనీ కుమదారి, ఆరెళ్ళలక్ష్మి, లైటింగ్ పండు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు తీరుపై సమీక్ష

చాగల్లు: వివిధ పథకాల అమలు తీరుపై శనివారం ఎంపీడీవో ఎస్.బుజ్జి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జగన్నకు చెబుదాం, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు.

4న మండల స్థాయి బూత్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకటరావు, పార్లమెంటరీ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాసరావు

తాళ్లపూడి: వచ్చే ఎన్నికల్లో బూత్‌కమిటీ సభ్యులు, స్థానిక నాయకులది కీలక పాత్ర అని కొవ్వూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాసరావు అన్నారు. మలకపల్లిలోని కల్యాణ మండపంలో శనివారం జరిగిన మండల వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తాళ్లపూడిలోని సొలస దమయంతి ఆర్య వైశ్య కల్యాణ మండపంలో మండల స్థాయి బూత్ కమిటీ సభ్యుల సమావేశం జరుగుతుందని, తప్పనిసరిగా బూత్ కమిటీల సభ్యులు పాల్గొనాలన్నారు. మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, నాయకులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ

నిడదవోలు: రానున్న ఎన్నికల్లో అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి నివేదిక అందించాలని ఆర్‌వో ఆర్.వెంకటరమణనాయక్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం వివిధ విభాగాల్లో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోండి

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కూలు ఎడ్యూకేషన్ అధికారి కె.వాసుదేవరావు సూచించారు. శనివారం ఐ.పంగిడి హైస్కూలు, దొమ్మేరు ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతుల నిర్వహణను ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి ట్యాబ్ వినియోగం గురించి ఆరా తీశారు. పాఠశాల యాప్‌లో విద్యార్థులకు అవసరమైన, ఉపయోగకరమైన సమాచారం ఉందన్నారు. వాటిని సమగ్ర పరిశీలించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలలో పారిశుద్ధ్యం, ప్రాంగణాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వహణను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఐ.పంగిడి హెచ్ఎం మంగిన శ్రీరామారావు, దొమ్మేరు ఎంపీఈపీ పాఠశాల హెచ్ఎం ఈ.రమాదేవి, ఇతర ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.